క్లుప్తంగా

గడగడపకు నిధుల పనులు వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జీజీఎంపీ(గడగడపకు మన ప్రభుత్వం) నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, అధికారులు గ్రామాల్లో నిర్వహించిన గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా ప్రజల కోరిక మేరకు కాలువలు, సీసీ రోడ్లు, మంచినీటి పథకాలు మంజూరు చేసినట్లు తెలియజేశారు. నిర్వాహకులు ఆయా పనులను ప్రారంభించినప్పటికీ పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇంతవరకూ చేపట్టిన పనులకు బిల్లులు జరుగుతున్నాయని, పనులు పూర్తి చేస్తే తక్షణమే ఇంజినీరింగ్ అధికారులు రికార్డ్ చేసిన వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు జరుగుతున్నట్లు చెప్పారు.

బయో ఇన్పుట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



బయోఇన్పుట్ సెంటర్‌ను ప్రారంభించిన ఏఓ శ్రావణ్

బలిజిపేట: చిన్న, సన్నకారు రైతులు బయో ఇన్పుట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శ్రావణ్ కోరారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలసలో డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు మామిడితోటలో ఏపీసీఎన్ఎఫ్ ఏర్పాటుచేసిన బయో ఇన్పుట్ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ పెట్టుబడులు తగ్గే అవకాశాలున్నాయన్నారు. అధిక దిగుబడులను పొందవచ్చని చెప్పారు. ఈ సెంటర్‌లో లభించిన దశపర్ణిక, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, మీనామృతం, ఎగ్ ఏమినో యాసిడ్, పంచగవ్య, పుల్లటి మజ్జిగ, జీవామృతాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది మానస, శారద, లక్ష్మి, దేవిప్రసాద్, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



బలిజిపేట ఎంఆర్సీ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బలిజిపేట: సమగ్ర శిక్ష ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ బలిజిపేట ఎంఆర్సీ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. తక్షణమే ఎంటీఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని, జూలై నెల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం

తెర్లాం: ఉత్తమ ఎంపీడీఓగా ఈ నెల 15న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డును అందుకున్న రామకృష్ణను మండల వీఆర్ఓలు సోమవారం సన్మానించారు. మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంలోను, మండల స్థాయి అధికారులందరినీ సమన్వయం చేసుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చేయడంలో ఎంపీడీఓ రామకృష్ణ విశేష కృషి చేస్తున్నారని వీఆర్ఓల సంఘ మండల నాయకులు కొనియాడారు.

షెడ్ ధ్వంసంపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న యోగా డైరెక్టర్లు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీయోగా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్‌ను పాడు చేసి బడ్డీ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని యోగా కేంద్రం డైరెక్టర్లు ఈశ్వర వరప్రసాద్, సత్య, స్థానికులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే సీఐ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు డైరెక్టర్లు తెలిపారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

రాజాం సిటీ: కళాశాల స్థాయిలోనే విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషిచేయాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై పి.నీలావతి, ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి, జీజే కళాశాల ప్రిన్సిపాల్ ఉరిటి జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలోని మెంటాడ మండలంలో కేంద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు ఈ నెల 25న రానున్న ప్రియతమ నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని తన గృహంలో సాలూరు మున్సిపాలిటీ, సాలూరు, పాచిపెంట, మెంటాడ, మక్కువ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనపై చర్చించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.

శుక్రవారం ఉదయం 7.30 గంటలకు నిర్దేశించిన ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల్లో బయల్దేరాలని సూచించారు. జననేత కార్యక్రమానికి వస్తున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాయకులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు మండలాల వారీగా కేటాయించిన ప్రాంతాల్లో భోజనసదుపాయాలు ఉంటాయని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు పరిసర నియోజకవర్గాల నుంచి సుమారు లక్ష మంది వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. నియోజకవర్గం నుంచి సుమారు 140 బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుమార వర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించాలని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం గెద్దలుప్పి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేపట్టి కాలువల్లో పూడికలు తీయించడం, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, దోమలు నివారణ మందు పిచికారీ చేయించడం, విద్యుద్దీకరణ పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. వర్షాలు కురవడం వల్ల విధిగా క్లోరినేషన్ చేయించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులకు నచ్చచెప్పి పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ. తిరుపతిరావు, కార్యదర్శి మోహనరావు, ఎంపీటీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేసుకోండి



నూతన గృహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జమ్మాన ప్రసన్న కుమార్

- ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన

బలిజిపేట: నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన గృహాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకోవాలని ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట మండలం మిర్తివలసలో నూతన గృహ నిర్మాణాలకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. లబ్ధిదారుల ఆహ్వానం మేర విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన వారు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసుకుని సొంత ఇంటి యజమానులు కావాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి



మడకవానివలసలో భజనలు నేర్పుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు మూర్తి

పార్వతీపురం: ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు విశ్రాంత ఉపాధ్యాయుడు పాగడ ట్లపల్లి మూర్తి కృషిచేస్తున్నారు.
ఈ మేరకు పార్వతీపురం మండలం సంగంవలస గ్రామానికి చెందిన ఆయన సమీప గ్రామమైన మడకవానివలసలోని గిరిజనులు, యువతకు భజనలు, రామాయణ, భాగవతంలోని కొన్ని ఘట్టాలను కథల రూపంలో తెలియజేసి భక్తి భావాన్ని, కుటుంబాన్ని ఎలా నడపాలనే విషయాలను సోదాహరణంగా వివరిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ప్రతిరోజూ భజనలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

రాజాం: ఖరీఫ్ సాగులో సాగు చేస్తున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడంతో పాటు రైతుల ఈకేవైసీని పూర్తిచేయాలని వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు ఆదేశించారు. వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సోమవారం ఈ–క్రాప్ నమోదుపై సమీక్ష నిర్వహించారు. వరి పంటతో పాటు మిగిలిన పంటల నమోదు కూడా వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్న కాలపరిమితి దగ్గరపడిందని, ఆ పంట సాగు చేస్తున్న రైతుల వివరాలు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రేణుకాసాయి, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

వంగర: రైతులు పండిస్తున్న ప్రతీ పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని ఏఓ టి.కన్నబాబు అన్నారు. మగ్గూరు ఆర్బీకేలో ఏఎస్ఓ అచ్యుత్ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలపై వీఏఏలకు సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 15లోగా ఈ–క్రాఫ్ నమోదు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

గుర్తింపు కార్డు ఉంటేనే గదులు కేటాయించండి

- ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: లాడ్జిలకు వచ్చే వ్యక్తుల వద్ద ఆధార్, తదితర గుర్తింపు కార్డులుంటేనే గదులు కేటాయించాలని ఎస్సై సురేంద్రనాయుడు అన్నారు. మండలంలోని పలు లాడ్జీలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు, బెట్టింగ్‌రాయుళ్లు, జూదరులు వంటి వారు లాడ్జీలలో మకాం వేసి తమ కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లాడ్జీల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మన సంస్కృతి ఎంతో గొప్పది

రాజాం సిటీ: భారతీయ సాంస్కృతిక వైభవం చాలా గొప్పదని శ్రీకాకుళంకు చెందిన డీవీ రమణమూర్తి, ఎం.రాధాకృష్ణ అన్నారు. డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం భారతీయ సాంస్కృతిక వైభవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ ప్రాచీన వైభవం, మహర్షుల ఆదర్శ జీవన విధానం, అఖండ భారతావని ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు రుంకు శ్రీనివాసరావు, వీరన్నాయుడు, సులోచన, శాంతికుమారి, సత్యంనాయుడు, గణేష్, భరత్, గోవిందరావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

రాజాం: స్పందనలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మండలంలోని అన్ని గ్రామ సచివాలయ డీడీఓలకు ఎంపీడీఓ బాసూరీ శంకరరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచిస్తూ సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరాతీశారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌జేఈ ప్రభాకరరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్, ఏఓ రేణుకాసాయి పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే సక్సెస్

రాజాం సిటీ: జీవితంలో పెద్ద పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడాలంటే సమాజంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ అన్నారు. జీఎంఆర్ ఐటీలో సోమవారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు పుష్కలంగా వనరులు ఉన్నాయని, ఇంజినీరింగ్ విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికతో ముందుకుసాగాలని సూచించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ఐటీలో చదువుకుని పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు శ్రీవాణి బీసెట్టి, సీహెచ్ పవన్ కుమార్, పి.బాలరాజు, పి.రవికుమార్, ఆర్.మాచి లక్ష్మణ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఈడీసీ కన్వీనర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు చేయకపోతే రైతులకు తీవ్ర నష్టం

- వ్యవసాయశాఖ పనితీరుపై సభ్యులు మండిపాటు
- సకాలంలో ఈ–క్రాప్, ఈకేవైసీ పూర్తిచేయాలి



ఈ–క్రాప్ నమోదుపై ఏఓ కన్నబాబును ప్రశ్నిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: రైతులు సాగుచేస్తున్న పంటలకు ఈ–క్రాప్‌తో పాటు ఈకేవైసీ పూర్తి చేయకపోతే పంటను అమ్ముకునే సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఆర్థికంగా నష్టపోతారని పలువురు సభ్యులు అన్నారు. వ్యవసాయశాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ–క్రాప్, ఈకేవైసీ పూర్తిచేయాలని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చ సందర్భంగా ఆ శాఖ అధికారుల పనితీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాలు సాగులో ఉంటే ఇప్పటివరకు కేవలం 3600 ఎకరాలు మాత్రమే ఈ–క్రాప్, ఈకేవైసీ పూర్తిచేశారని అన్నారు. ఈ–క్రాప్ నమోదు కాకుంటే రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసి రైతుల ఈకేవైసీ పూర్తిచేయాలని కోరారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను హార్టీకల్చర్ అధికారి ఉమామహేశ్వరి వివరించారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో ఎం.సీ తారాంపురం ఫీడర్ 65 కిలోమీటర్లు దూరం ఉన్నందున వీవీఆర్‌పేట, రాజులగుమ్మడ గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నామని ఏఈ కె.వినయ్‌కుమార్ సభ్యులకు వివరించారు. వీవీఆర్‌పేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. శివ్వాం పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని రాజాం బ్రాంచ్ మేనేజర్ వెల్లడించారు. ఆర్బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏఈ ఆనందరావు కోరగా.. సకాలంలో బిల్లులు చెల్లిస్తే పనులు చేపడతామని పలువురు సర్పంచ్‌లు వివరించారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు విస్తృతంగా అందుతున్నాయని, ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వైద్యాధికారి సుష్మిత దయాన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారాయణ, మండల విప్ తెంటు కుమారి, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, ఏఓ కన్నబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ సేవలకు అభినందన



కేజీహెచ్‌లో బెడ్‌పై ఉన్న మల్లీశ్వరికి ఈకేవైసీ చేస్తున్న వలంటీర్ పార్వతి

సీతానగరం: మండల కేంద్రంలోని దేవాంగుల వీధికికి చెందిన వలంటీర్ ఎస్. పార్వతి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించాలనే సకల్పంతో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ మేరకు అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దేవాంగుల వీధికి చెందిన అల్లం మల్లీశ్వరికి జగనన్న తోడు పథకం ద్వారా లబ్ధి పొందడానికి అర్హతలున్నాయి. ఈ నేపథ్యంలో ఈకేవైసీ చేయాల్సి ఉందని సంబంధిత అధికారులు వలంటీర్ పార్వతికి సూచించడంతో గడువు ముగుస్తున్న కారణంగా అధికారుల సూచన మేరకు ఆమె వ్యయ ప్రయాసల కోర్చి విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి జగనన్న తోడు లబ్ధిదారు మల్లీశ్వరికి ఈకేవైసీ చేయించింది. సామాజిక బాధ్యతగా సేవలందిస్తున్న వలంటీర్ పార్వతిని పెదభోగిలి సచివాలయ ఉద్యోగులు, సహచర వలంటీర్లు, మల్లీశ్వరి కుటుంసభ్యులు అభినందించారు.

పథకాల అమలులో అశ్రద్ధ వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యాశాఖకు సంబంధించిన అంశాల అమలులో సీఎంఆర్టీలు ఎటువంటి అశ్రద్ధ వహించవద్దని ఎంఈఓ–1 సామల సింహాచలం కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంఆర్సీ వద్ద సీఎంఆర్టీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనుల పురోగతి, బడి బయిట పిల్లల వివరాలు సత్వరమే అందచేయాలని సూచించారు. విద్యాశాఖ అమలు చేస్తున్న విద్యా విధానాలపై పాఠశాల స్థాయిలో పరిశీలించి వివరాలను ప్రతిరోజూ తెలియపరచాలని సూచించారు. జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలవుతున్నదీ లేనిదీ పరిశీలించి నివేదికలు అందించాలని చెప్పారు. విద్యాశాఖ పరంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పక్కాగా అమలవుతున్నదీ లేనిదీ తెలియపరచాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఆర్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండకు కేంద్రానిదే బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం, క్రైస్తవ సంఘాలు

- క్రైస్తవ, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

పార్వతీపురంటౌన్: మణిపూర్‌లో హింసాకాండకు కేంద్రమే బాధ్యత వహించాలని క్రైస్తవ, ముస్లిం సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటనను నిర్వహిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించామన్నారు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా మత కలహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనపై ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిషప్ సుదర్శనరావు, స్టీఫెన్‌పాల్, పి.జాకబ్, కె.విజయరాజు, జి .తంబిపాల్, ఎస్‌కే పాల్, ఎ.శామ్యూల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించుకోవాలి



పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న డీవైఎస్ఓ సత్యనారాయణ

సీతానగరం: మండలంలోని రైతులు పొలాల్లో సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ శాఖ వీఏఏలు, ఉద్యాన శాఖ వీఏఏలు పరిశీలించి గణాంకాల ఆధారంగా పంట కోత ప్రయోగాలు చేసేందుకు అవగాహన కల్పించుకోవాలని జిల్లా సీపీఓ ఆఫీస్ డీవైఎస్ఓ వైవీఎస్ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పెదభోగిలి ఆర్బీకే కార్యాలయంలో ఏఓ ఎస్.అవినాష్ అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యాన శాఖల వీఏఏలకు పంటకోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల బీమా అనేది పంట కోత ప్రయోగాల ఆధారంగానే ఇస్తారన్నారు. 5 సంవత్సరాలు ముందున్న సాధారణ దిగుబడి ప్రాతిపదికన పంటదిగుబడి నష్టాన్ని అంచనా వేస్తారని చెప్పారు. జిల్లాలో అధికంగా పండిస్తున్న పంటను బట్టి పంట కోత ప్రయోగాలు ఏమేరకు చేయాలో నిర్ణయించనున్నట్టు తెలిపారు.

తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పొలాల్లో రైతులు పండించే పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించాలని, పంటల నాశించే తెగులు నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సబ్‌డివిజనల్ ఏడీఏ వెంకటేష్ హితవు పలికారు. ఈ మేరకు సోమవారం ఈ క్రాప్ బుకింగ్, పంటకోత ప్రయోగాలపై జిల్లా గణాంక అధికారులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీతానగరం మండల ఏఎస్ఓ సతీష్, గ్రామ వ్యవసాయ ఉద్యాన శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను గడువులోగా పరిష్కరించాలి



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఎంపీడీఓ రమామణి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏ కారణం చేతనైనా సమస్యను పరిష్కరించలేకపోతే అందుకుగల కారణాలను అర్జీదారుడికి తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరమణ పాల్గొన్నారు

సకాలంలో..

తెర్లాం: జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన వినతులను ఎంపీడీఓ స్వీకరించారు. మండలంలోని గోపాలవలస పంచాయతీలో పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని కోరుతూ సర్పంచ్ ప్రతినిధి గొందాల వెంకటరావు, మాజీ సర్పంచ్ గణపతిరావు కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఏఈ జోగినాయుడును ఆదేశించారు.